సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



కబ్జా కోరల్లో ఈద్గా స్థలం!

రైల్వేకోడూరు మండలం మైసూరావారిపల్లి పంచాయతీ పరిధిలో రూ.కోట్లు విలువ చేసే భూమి కబ్జాకోరల్లో చిక్కుకుంది.

-IIలో..



కల్తీ మద్యం ముఠా అరెస్టు

రైల్వేకోడూరు, తిరుపతి తదితర ప్రాంతాలలో కల్తీ మద్యం విక్రయిస్తూ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.

-IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 33 మెట్రిక్ టన్నులు



అన్నమయ్య ఆశలపై నీళ్లు

- చంద్రబాబు రాకతో భారీగా అంచనాలు
- రోడ్లు, ప్రాజెక్టులు తప్ప మరొకటి మాట్లాడని వైనం
- జిల్లాకు ప్రయోజనం చేకూర్చని బాబు పర్యటన



సీఎం కాన్వాయ్‌లో ఇరుక్కు పోయిన తల్లీ బిడ్డ వాహనం

సాక్షి రాయచోటి: జిల్లాల పునర్విభజనలో భాగంగా పురుడు పోసుకున్న అన్నమయ్య జిల్లా ఆశలపై సీఎం చంద్రబాబు నీళ్లు కుమ్మరించారు. ముఖ్యమంత్రి హోదాలో జిల్లా ఏర్పడిన అనంతరం తొలిసారిగా వచ్చిన నేపథ్యంలో ప్రజల్లో భారీ అంచనాలు ఉన్నాయి. జిల్లాపై నిధుల వర్షం కురిపిస్తారని.. ఎన్నెన్నో కొత్త ప్రాజెక్టులు ప్రకటిస్తారని ప్రజలు ఆశించారు. అయితే జిల్లాలోని వివిధ ప్రాంతాల గురించి చర్చే లేకుండా సభ జరిగిపోయింది. ముఖ్యమంత్రి వస్తున్నారనగానే అనేక విధాల ప్రయోజనాలు ఒనగూరుతాయని చాలా వరకు ఆశించినా అవి అడియాశలుగానే మిగిలాయి.

సీఎం నోట....రోడ్డు, ప్రాజెక్టుల మాట

అన్నమయ్య జిల్లాకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నోట రోడ్ల గురించి ప్రస్తావించారు. సుమారు రూ. 6 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లు వేశామని, దాదాపు 80 శాతానికి పైగా పూర్తయినట్లు చెప్పారు. అంతేకాకుండా బనకచర్ల నుంచి ఈ ప్రాంతానికి నీళ్లతీసుకు వచ్చి హంద్రీ–నీవా కెనాల్ ద్వారా తంబళ్లపల్లె నుంచి చిత్తూరువరకు తీసుకు వెళతామని వెల్లడించారు. మధ్యలో శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులు పూర్తిచేస్తామని బాబు నోట హామీ మాట వచ్చింది. అంతే తప్ప జిల్లా గురించి మాట్లాడలేదు. చివరకు హోంటు వర్క్ చేస్తున్న సంబేపల్లెలోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో మాట్లాడిన సందర్భంలో....పలువురు రాయచోటి ప్రాంతం బాగా వెనుకబడి ఉందని, ఇక్కడ ఏదైనా సాఫ్ట్‌వేర్ పరంగా అభివృద్ధిచేయాలని కోరగా, దీనికి సంబంధించి కూడా బాబు ఎలాంటి హామీ ఇవ్వలేదు.

మదనపల్లె వైద్య కళాశాల, అన్నమయ్య ప్రాజెక్టు మాటే లేదు

మదపల్లెలోని వైద్య కళాశాలకు సీట్లు రద్దుచేయడం, ఉన్న పెద్దాస్పత్రిని ప్రైవేటుపరం చేస్తున్నారని ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి నాయకుడు మాధవ్ సభలో ముఖ్యమంత్రి ప్రైవేటుపరం చేయబోనని ప్రకటన చేయాలని కోరారు. అయితే మదనపల్లెకు సంబంధించి కళాశాల, ఆస్పత్రి, ఇతర అభివృద్ధి గురించి సీఎం నుంచి ఎలాంటి హామీ రాలేదు. అంతేకాకుండా గతంలో రాజంపేట సమీపంలోని అన్నమయ్య ప్రాజెక్టు వరద ధాటికి కొట్టుకుపోయింది. దీని గురించి కూడాచిన్నపాటి మాట కూడా మాట్లాడలేదు. ప్రాజెక్టుల గురించి ప్రస్తావన వచ్చినా అన్నమయ్యమాట లేకుండా పోయింది. ప్రధానంగా రాయచోటికి బాబు భారీగా నిధులు ప్రకటిస్తారని భావించినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది.

జాతీయ రహదారిలో ప్రజలకు తప్పని ఇబ్బందులు

జిల్లాలోని కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిలోని సంబేపల్లె వద్ద కాసేపు ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. ముఖ్యమంత్రి సమీపంలోని హెలిప్యాడ్ దిగి వస్తున్న సమయంలోనూ..సభ ముగిసిన అనంతరం జాతీయ రహదారికి ఇటు, అటువైపున వాహనాలు నిలిపి వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడికక్కడ నిలబడి సీఎం కాన్వాయ్ వెళ్లిన అనంతరం ముందుకు కదిలారు.

» వినతులు ఇచ్చేవారిలో నిరాశ

చంద్రబాబు వస్తున్నారని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించిన కొందరి అర్జీలను సీఎం చంద్రబాబు తీసుకోకపోవడంతో నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు. సభా వేదిక పైనుంచి నేరుగా కిందికి వచ్చి వినతులు తీసుకుంటుండగా జనాలు ఒకరినొకరు ఇచ్చేందుకు పోటీలు పడ్డారు. దీంతో బలంగా ఉన్న వారు ముందుకు తోసుకొచ్చి ఇవ్వగా, చాలా మంది వెనుకవైపు ఇవ్వలేని పరిస్థితి కనిపించింది. బాబు కూడా చివరలో నేరుగా కొంతమంది అర్జీలు స్వీకరించి అలాగే వెళ్లిపోయారు. పలువురు బాధతో తిరుగుముఖం పట్టారు.

రాముని సేవలో హనుమ



హనుమంత వాహనంపై కడప రాయుడు

కడప కల్చరల్: తన ప్రభువు, లోక పాలకుడు శ్రీరామచంద్రుడు కార్యర్థమై తనను సేవకుడిగా ఎంచుకున్నందుకు హనుమ పులకించిపోయాడు. ఆ సేవ అదృష్టంగా భావించి శ్రీరాముడికి వాహనమై స్వామి తరించాడు. కోదండపాణిగా రాముడు వనవిహారం చేసేందుకు సహకరించాడు. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి ఉదయం కల్పవృక్ష వాహనంపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్షం వాహనంపై స్వామి ఊరేగింపు ఏర్పాటు చేయడంతో తిలకించేందుకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం హనుమంత వాహనంపై కోదండ రాముడిగా కొలువుదీరాడు. వేద పండితులు స్వామి అమ్మవార్ల మూల విరాట్లకు విశేష అలంకారం చేశారు. అనంతరం ఆలయం వెలుపలగల అలంకారం మండపంలో స్వామిని వాహనంపై ఆసీనులను చేశారు. సూర్యతేజోమయుడైన శ్రీ రామచంద్రుడు ధగధగలాడే రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో మరింతగా మెరిసిపోతూ భక్తులను కరుణించాడు. పాతకడప, దేవునికడపలతోపాటు నగరానికి చెందిన భక్తులు స్వామి వెంట ఊరేగింపులో పాల్గొన్నారు.

సీఎం సాక్షిగా బయటపడిన విభేదాలు

ముఖ్యమంత్రి పర్యటనకు దూరంగా సుగవాసి

రాయచోటి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాక్షిగా రాయచోటిలో టీడీపీ నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో కొన్ని నెలలుగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగవాసి కుటుంబాల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు రాయచోటి నియోజకవర్గం పర్యటనకు వచ్చినా టీడీపీలో సీనియర్ నాయకుడిగా చెప్పుకునే సుగవాసి పాలకొండ్రాయుడు చిన్న కుమారుడు ప్రసాద్‌బాబు హాజరు కాలేదు.సీఎం పర్యటన ఆహ్వాన సమాచారం ప్రసాద్‌బాబుకు అందలేదన్న వార్తలు సోషల్ మీడియా, వాట్సాప్‌లలో హల్‌చల్ చేస్తున్నాయి. పార్టీ ప్రారంభం నుంచి పనిచేస్తున్న కుటుంబానికి ముఖ్యమంత్రి పర్యటన ఆహ్వానం ఇవ్వకపోవడంపై టీడీపీలోని నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. పాలకొండ్రాయుడు పెద్దకుమారుడు, రాజంపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి సుబ్రమణ్యంకు హెలిప్యాడ్ దగ్గరకు ఆహ్వానం ఉన్నా ఆయన కూడా అక్కడికి వెళ్లకుండా సంబేపల్లి మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ దగ్గర ముఖ్యమంత్రితో చేతులు కలిపి అక్కడ నుంచి నేరుగా రాయచోటికి తిరుగు ప్రయాణం అయ్యారు. దీంతో నియోజకవర్గంలోని టీడీపీ నాయకుల మధ్య తలెత్తిన వివాదం ఎటు దారితీస్తుందోనన్న వ్యాఖ్యలు వినిపించాయి. ఇప్పటికే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిపైన రాజంపేట పార్టీ ఇన్‌చార్జి సుబ్రమణ్యం ప్రజా వేదికల మీదనే తిరుగుబాటు చేసిన విషయం తెలిసిందే. రాయచోటిలో పార్టీలో సీనియర్ నేతగా పనిచేస్తున్న ప్రసాద్ బాబుకు శనివారం ముఖ్యమంత్రి పర్యటన ఆహ్వాన సమాచారం లేకపోవడంపై పార్టీలో పెద్దచర్చకు దారితీసింది.



ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన మధ్యలోనే అనుచరులతో కలిసి వెనుతిరిగి వెళ్తున్న సుగవాసి సుబ్రమణ్యం

రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారు

రాజకీయంగా తనను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు కుమారుడు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ప్రసాద్ బాబు సోషల్ మీడియా ద్వారా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చంద్రబాబు పర్యటనకు రాకపోవడంపై సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులలో రకరకాల కథనాలు వెలువడటంతో తాను స్పందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి విడుదలైన పేర్ల జాబితాలో హెలిప్యాడ్, ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, గ్రామసభ ప్రాంగణాలలో ప్రకటించిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారుల జాబితాలో తన పేరును చేర్చలేదన్నారు. 64 మంది, 30 మంది జాబితాల ప్రకటనలో తన పేరును లేకుండా చేసిన వారెవ్వరో తనకు తెలుసు అన్నారు. పర్యటన సందర్భంగా జరిగిన విషయాలను పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్తానన్నారు. త్వరలో తనను వచ్చి కలవాలని అధ్యక్షుడు సూచించారన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేష్ ల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తనను పార్టీ నుంచి ఎవరూ దూరం చేయలేరని ప్రసాద్ బాబు మీడియా ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఒక సందేశాన్ని ఇచ్చారు. పార్టీ అభిమానులు, నాయకులు నేడు జరిగిన సంఘటనపై ఎలాంటి పోస్టులు పెట్టరాదని ప్రసాద్ బాబు విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

కేజీబీవీ ఎస్వో సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

పెద్దతిప్పసముద్రం: స్థానిక అంకిరెడ్డిపల్లి రోడ్డులో ఉన్న కస్తూర్బా బాలికా విద్యాలయం(కేజీబీవీ) ఎస్వో శైలజను సస్పెండ్ చేసినట్లు డీఈఓ డాక్టర్ కె.సుబ్రమణ్యం శనివారం పేర్కొన్నారు. సమగ్ర శిక్షా పీఎం పోషణ్ సామాజిక తనిఖీ బృందం బహిర్గతం చేసిన విషయాల్లో ఎన్నో అక్రమాలు, బాలికల పట్ల వేధింపులు లాంటి ఎన్నో నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయంపై ఈ నెల 26న ‘సాక్షి’లో ప్రచురితమైన ‘మా బిడ్డలకు ఏదీ రక్షణ’కథనంపై జిల్లా కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్వో శైలజను సస్పెండ్ చేస్తూ కస్తూర్బా కేజీబీవీకి ఉత్తర్వులు పంపినట్లు డీఈఓ వెల్ల డించారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకంతో నాగరాజు

లక్కిరెడ్డిపల్లి: సంయుక్త భారతీయ కేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జైపూర్‌లో జనవరి 30, 31వ తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో లక్కిరెడ్డిపల్లి మండలం మేడిమాకుల గుంతకు చెందిన కొర్లకుంట నాగరాజు ప్రతిభ కనబరిచాడు. 74 కిలోల విభాగంలో 450 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఫౌండేషన్ ప్రెసిడెంట్ పంకజ్ గౌడ్, జనరల్ సెక్రటరీ శివ తివారీ చేతుల మీదుగా పతకం అందుకున్నాడు. నాగరాజు పతకం సాధించడం పట్ల తల్లిదండ్రులు కొర్లకుంట రమణయ్య, రత్నమ్మ సంతోషం వ్యక్తం చేశారు. లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య నాగరాజుకు అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలకు నిధుల కొరత

వేంపల్లె: రాష్ట్రంలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలకు నిధుల కొరత ఉందని ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు నూతన భవనాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, కంప్యూటర్లు, మౌలిక వసతులు, మెస్సులు తదితర వాటికి రూ.300 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

ములకలచెరువు టమాటా అండమాన్‌కు..



ఎగుమతికి సిద్ధం చేసిన టమాటాలు

ములకలచెరువు: తంబళ్లపల్లె నియోజక వర్గం ములకలచెరువు మండలం నుంచి టమాటా అండమాన్ నికోబార్ దీవులకు ఎగుమతి అవుతోంది. ములకలచెరువుకు చెందిన రైతు మునీర్ సాగు చేసిన తోట నుంచి టమాటాలను కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన వ్యాపారులు వచ్చి కొనుగోలు చేశారు. ఒక్కో బాక్స్ రూ.450తో కొన్నారు. ప్రస్తుతం ఇక్కడి మార్కెట్లో బాక్స్ కేవలం రూ. వంద నుంచి రూ. 200 మాత్రమే పలుకుతోంది. తోట దగ్గరకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుండడంతో రైతుకు గిట్టుబాటు లభిస్తోంది. ములకలచెరువు నుంచి టమాటాలను మినీ లారీలో తమిళనాడు రాష్ట్రం చెన్నైకి తీసుకెళ్లి అక్కడి నుంచి షిప్ ద్వారా అండమాన్ నికోబార్ దీవులకు తరలిస్తున్నారు. ఇక్కడి నుండి అండమాన్ నికోబార్ దీవులకు మూడు వేల కిలోమీటర్లు దూరం ఉంది.

నిర్మలమ్మ మొండిచేయి!



కేంద్రబడ్జెట్‌లో ప్రస్తావన లేని రీఆర్గనైజేషన్ బిల్లు అంశాలు

సాక్షి ప్రతినిధి కడప: కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మరోసారి మొండిచేయే మిగిలింది. ఏపీ రీఆర్గనైజేషన్ బిల్లుపై శ్రద్ధే లేకుండా పోయింది. వైఎస్సార్ జిల్లాకు ఉక్కుపరిశ్రమ ఊసే లేదు. రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతంపై కేంద్రానికి చిత్తశుద్ధి కొరవడింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆర్థిక మంత్రి నిర్మలమ్మ మరోసారి మొండిచేయి చూపింది.

- కేంద్రప్రభుత్వం చర్యలు నేరుగా లబ్ధిదారునికి ఊరట కల్పించే దిశగా ఉన్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ ఈ విషయం స్పష్టం చేస్తోంది. రాష్ట్రాల ప్రయోజనాలతో నిమిత్తం లేకుండా అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు, పేద, మధ్య తరగతి ప్రజానీకానికి లబ్ది చేకూరేలా నిర్ణయం తీసుకున్నారు. అద్దె ఆదాయంపై వార్షిక టీడీఎస్ రూ.2.4లక్షల పరిమితిని రూ.6లక్షలకు పెంచారు. వేతనజీవులకు ఆదాయపు పన్ను పరిమితి రూ.12లక్షలకు పెంచారు. ఆపై ఆదాయం గడించేవారు మాత్రమే ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంది. ఈపరిణామాన్ని ఉద్యోగ వర్గాలు స్వాగతిస్తున్నాయి.
- కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఏపీ రీ ఆర్గనైజేషన్ బిల్లులోని అంశాలు గుర్తుకు రాలేదని పలువురు వాపోతున్నారు. రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతాల ఉన్నతి కోసం ప్రత్యేక శ్రద్ధ చూపడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందని పరిశీలకులు వాపోతున్నారు.

రాష్ట్రానికి ఒరిగిందేమి లేదు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి ఒరిగిందేమీ లేదు. అన్యాయం జరిగింది. ఎన్డీఏ భాగస్వాములుగా ఉంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు సాధించింది ఏమి లేదు. వ్యవసాయానికి ఊతమిచ్చే ప్రకటన చేయకపోవడం బాధాకరం. ఏపీకీ జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టును 41 మీటర్లు నిర్మాణం చేయనున్నట్లు ప్రకటించినా కూటమి నాయకులకు చీమకుట్టినట్టు కూడా లేదు. రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టు సాధించుకోవడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారు. – కొరముట్ల శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే, రైల్వేకోడూరు

రాష్ట్రానికి మొండిచేయి



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగింది. 12 మంది ఎంపీలు ఉన్న బీహార్‌కు అధిక నిధులు ఇచ్చారు. 16 మంది ఎంపీలు ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి ఏమి తెచ్చింది. రాష్ట్రానికి మళ్లీ మొండిచెయ్యి చూపారు. రాష్ట్రానికి బడ్జెట్‌లో అధిక నిధులు తేవడంలో కూటమి ఎంపీలు విఫలమయ్యారు. –నిస్సార్‌అహ్మద్, వైఎస్సార్‌సీపీ నియోజకరవర్గ సమన్వయకర్త

ఆంధ్ర ప్రజల ఆశలు అడియాసలు



కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలను అడియాసలు చేసింది. ఏపీకి మళ్లీ మొండిచేయి చూపింది. ఏపీకి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ తదితర విభజన హామీలను పక్కన పెట్టింది.విశాఖ రైల్వే జోన్,కడప స్టీల్‌ప్లాంట్, వెనుకబడిన జిల్లాలకు నిధుల ఊసే లేదు. దీనిపై సీఎం స్పందించాలి. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీల ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలి. – సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఏపీకి తీరని అన్యాయం



కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయమే జరిగింది. కూటమి నాయకులు డబల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి అంటూ గొప్పలు చెప్పారు. అయితే బడ్జెట్‌లో ఏపీకి అరకొర నిధులే కేటాయించారు. . బీహార్‌తో సమానంగా ఏపీకి కేటాయింపులు ఉండి ఉంటే బాగుండేది. –చిట్వేలి రవికుమార్, సీఐటీయూ నాయకులు, రాజంపేట

ఎల్ఐసీని దెబ్బతీసే నిర్ణయం



కేంద్ర బడ్జెట్‌లో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడం దారుణం. ఈనిర్ణయం ఎల్ఐసీని పరోక్షంగా దెబ్బతీస్తుంది. స్వదేశీ భాగస్వామ్య కంపెనీ లేకుండా నేరుగా విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలు దేశంలో ఏర్పాటైతే పాలసీదారుల డబ్బులకు భద్రత ఉండదు.1956కు ముందు పాలసీదారులను ముంచేసిన మోసాలు పునరావృతమవుతాయి.–జి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్, రాజంపేటశాఖ

క్లుప్తంగా

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన రాజు

పీలేరు రూరల్ : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన పీలేరు – కలికిరి మార్గంలోని అంకాలమ్మ గుడి సమీపంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వాల్మీకిపురం మండలం గండబోయనపల్లెకు చెందిన ఆర్. రాజు (40) శనివారం ద్విచక్రవాహనంలో పీలేరుకు బయలుదేరాడు. పీలేరు పట్టణం పద్మావతి నగర్‌కు చెందిన ఎస్. హసీనా (35), ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎల్. రెడ్డెమ్మ (45) స్కూటీలో బయలుదేరారు. అయితే మార్గ మధ్యంలోని అంకాలమ్మ గుడి వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం రాజును, హసీనాను మెరుగైన వైద్య కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

భూమి ఫెన్సింగ్, డెకరేషన్ సామగ్రి ధ్వంసం

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని రింగురోడ్డుకు ఆనుకొని ఉన్న మామిళ్లపల్లి గ్రామ పొలం సర్వే నంబర్ 555లో గల తమ భూమి ఫెన్సింగ్, భూమిలోని డెకరేషన్ సామగ్రిని శనివారం తెల్లవారుజామున ధ్వంసం చేశారని చింతకొమ్మదిన్నె మండలం అంగడివీధి నివాసి మంత్రి కిరణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పగడాల సుబ్బయ్య, ప్రదీప్ మరికొందరితో కలిసి ఈ చర్యకు పాల్పడ్డారని చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై సీఐ శంకర్ నాయక్‌ను వివరణ కోరగా ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని, కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని తెలిపారు. కాగా ఈ భూమికి సంబంధించి కడప ఆర్డీఓ కోర్టులో ఒకరికి అనుకూలంగా, మరొకరికి జేసీ కోర్టులో అనుకూలంగా తీర్పు వచ్చి, హైకోర్టులో సివిల్ కేసులు నడుస్తున్నట్లు తెలిసింది.

56 మద్యం బాటిళ్లు పట్టివేత

లింగాల : మండలంలోని అంబకపల్లె గ్రామంలో శివగంగిరెడ్డి ఇంట్లోని బెల్టు షాపులో మద్యం అమ్ముతుండగా దాడి చేసి 56 మద్యం బాటిళ్లను పట్టుకుని కేసు నమోదు చేశామని రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. శనివారం స్థానిక లింగాల పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదనరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో ఈద్గా స్థలం!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈద్గాకు స్థలం కేటాయింపు
- రూ.కోట్లు విలువ చేసే భూమి కబ్జాకు కూటమి నేతల యత్నాలు

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మైసూరావారిపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 2085లో రూ.10 కోట్లు విలువ చేసే 17 ఎకరాలు స్వాహా చేసేందుకు కొందరు జనసేన నాయకులు పావులు కదుపుతున్నారు. ఇందుకు ఆ పార్టీలో రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పే నాయకుడి సహకారం పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 17 ఎకరాల్లో ముస్లిం మైనార్టీల ప్రార్థనలకు కేటాయించిన 4 ఎకరాల 25 సెంట్ల ఈద్గా భూమిపై గ్రామ పంచాయితీ తరఫున స్టే ఉందని, కనుక ముస్లిం మైనార్టీల ప్రార్థనలకు కేటాయించిన స్థలం రద్దు చేసి గ్రామ అవసరాలకు కేటాయించేలా చూడాలని స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు స్థానిక జనసేన సర్పంచ్ లేఖ రాశారు. దీని వెనుక అంతర్యం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. కొందరు నాయకులు ఈ భూమిని అప్పగిస్తామని పలువురి వద్ద రూ. లక్షల్లో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ భూమిలో మట్టి తోలి ఆక్రమణకు మార్గం సుగమం చేసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈద్గా స్థలం కేటాయింపు..

రైల్వేకోడూరులో ముస్లింలు 12 వేలమందికి పైగా ఉన్నారు. వీరంతా పండుగ సమయాల్లో ప్రార్థనలు చేసుకునేందుకు ఇబ్బందులు పడేవారు. ఎన్నో సంవత్సరాలుగా ఈద్గా స్థలం సరిపోక జాతీయ రహదారిపై ఎండలో ప్రార్థనలు చేసేవారు. వారి సమస్య గుర్తించిన అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైసూరావారిపల్లి వద్ద ప్రత్యేకంగా 4 ఎకరాల 25 సెంట్ల భూమిని కేటాయించారు. అక్కడ ఈద్గా నిర్మాణం చేపట్టి గత మూడు సంవత్సరాలుగా వేలాది మంది ముస్లింలు పండుగల సమయంలో ప్రార్థనలు చేస్తున్నారు.


ఈద్గాకు కేటాయించిన స్థలం


ఈద్గా స్థలంలో కొందరు మట్టి తోలిన దృశ్యం

కూటమిలో భిన్నాభిప్రాయాలు

భూ బాగోతం విషయమై కూటమిలోని టీడీపీ, జనసేనలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జనసేనలోని ఒక వర్గం నాయకులు కబ్జాయత్నాలను బహిరంగంగానే విమర్శిస్తూ సోషియల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. అలాగే కొందరు ముస్లిం నాయకులు ఈ విషయాన్ని టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పూర్తి స్థాయిలో సర్వే జరిపి తప్పని సరిగా ఆ స్థలాన్ని ముస్లింలకు కేటాయిస్తామని చెప్పినట్లు తెలిసింది.

ప్రార్థనా స్థలం కాపాడుకుంటాం



నియోజకవర్గంలో కూటమి నాయకుల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయి. 15 సంవత్సరాలుగా ముస్లింలు రోడ్డుపైనే ప్రార్థనలు చేస్తుంటే వారు పడుతున్న బాధలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారికి ఈద్గా స్థలం కేటాయించాం. వారికి కేటాయించిన భూమి అన్యాక్రాంతమైతే ఉరుకోము. ఆందోళనలు చేపడతాం. నియోజకవర్గంలో అన్ని మతాల సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రతి ఒక్కరికీ స్థలాలు, నిధులు కేటాయించాం. ఇప్పుడు అధికారంలో ఉన్నవారు వాటిని అభివృద్ధి చేయాల్సింది పోయి విధ్వంసం చేయడం మంచి పద్ధతి కాదు.
– కొరముట్ల శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి

ఇలాంటివి ప్రోత్సహించడం సబబుకాదు



ప్రార్థనా స్థలాల జోలికి రావడం సబబుకాదు. ఇలాంటి విషయాలను కూటమి పెద్ద నాయకులు ప్రోత్సహించడం సరికాదు. తక్షణమే వాటికి అడ్డుకట్ట వేయాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థలం కేటాయించేందుకు ఎంతగానో కృషి చేశాం. – వైఎస్ అన్వర్‌బాషా, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు, రైల్వేకోడూరు.

జ్యోతి క్షేత్రంలో 7న సమావేశం

కాశినాయన : జ్యోతి క్షేత్ర పరిరక్షణ కోసం ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు జ్యోతిక్షేత్రంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి నిరజానందస్వామి తెలిపారు. జ్యోతి క్షేత్రంలోని కొన్ని భవనాలకు అటవీశాఖ అనుమతులు లేవని ఇటీవల కాలంలో మూడు సార్లు కూల్చి వేశారని, దీన్ని అడ్డుకునేందుకు అందరం సమష్టిగా పనిచేయాలని అన్నారు. శనివారం జ్యోతి క్షేత్రాన్ని ఆయన సందర్శించి కూల్చిన కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశినాయన పాడుబడిన దేవాలయాలను పునరుద్ధరించి అన్నదానం ఏర్పాటు చేసిన మహారుషి అన్నారు. అలాంటి ఆయన క్షేత్రాన్ని అటవీశాఖ అనుమతు లు లేవంటూ అటవీశాఖ అధికారులు కూల్చేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. ఈ సమావేశానికి అన్ని గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల కాశినాయన భక్తులు పాల్గొన్నారు.

హాస్టల్ ఉద్యోగిపై చర్యలు తీసుకుంటాం


విద్యార్థి ఒంటి మీద ఉన్న గాయాలను పరిశీలిస్తున్న సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని ఎస్సీ హాస్టల్‌లో శుక్రవారం రాత్రి అక్కడ పనిచేసే రవికుమార్ అనే హాస్టల్ ఉద్యోగి హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని బెల్టుతో వీపుపై చితకబాదాడు. విషయం తెలుసుకున్న సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి శనివారం హాస్టల్‌ను సందర్శించారు. ఉద్యోగిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డి లక్ష్యంగా గోబెల్స్ ప్రచారం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కుటుంబ సభ్యులకు ఉన్న ప్రజాదరణ, నిబద్ధత, నిజాయితీ చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పథకం ప్రకారం కావాలనే అనుకూల పత్రికలో గోబెల్స్ ప్రచారం చేయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాజకీయంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేకనే పచ్చమీడియా ద్వారా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారన్నారు. 2001లో ఆయన చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములను అటవీ భూమి అంటూ ప్రచారం చేస్తూ, ఆక్రమణలకు పాల్పడ్డారని తప్పుడు కథనాలు రాయిస్తున్నారన్నారు. అటవీ భూములు ఆక్రమించుకోవాల్సిన ఆగత్యం పెద్దిరెడ్డి కుటుంబానికి లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేని చంద్రబాబునాయుడు ప్రతినెలా ఏదో ఒక అంశంపై విపరీత ప్రచారం చేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు పోతబోలు నాగరాజు, ఐటీ విభాగం అధ్యక్షుడు డాకరాజుగారి అరవింద్ తిలక్, మహిళా విభాగం అధ్యక్షురాలు నీరుగట్టు మేరీ, నాగరాజరెడ్డి, జన్నే రాజేంద్రనాయుడు, కోటూరి ఈశ్వర్, మహేష్ తదితరులు నిసార్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.


నిసార్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు

ఫీజు చెల్లించాలని ఫార్మసీ కళాశాల వేధింపులు

ప్రొద్దుటూరు : మండలంలోని పెద్దశెట్టిపల్లెలో ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం తనను ఫీజు చెల్లించలేదని వేధిస్తోందని బి.ఫార్మసీ రెండో సంవత్సరం విద్యార్థిని యు.ప్రసన్న శనివారం ప్రొద్దుటూరు కోర్టు మండల లీగల్ సర్వీస్ అథారిటీకి ఫిర్యాదు చేసింది. కళాశాలలో చేర్చుకునేటప్పుడు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే చెల్లిస్తుందని కళాశాల యాజమాన్యం చెప్పిందని విద్యార్థిని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం ఫీజు చెల్లిస్తేనే పరీక్ష రాసేందుకు హాల్ టికెట్ ఇస్తామని వేధించారన్నారు. తమ తల్లిదండ్రులు అంత ఫీజు కట్టలేరని చెప్పినా వారు వినలేదని తెలిపారు. తోటి విద్యార్థుల ముందు కించపరిస్తూ దురుసుగా మాట్లాడుతూ తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని కళాశాల యాజమాన్యం చెబుతోందని తెలిపారు. సోమవారం జరగనున్న పరీక్షలకు ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామని వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు ఇంత ఫీజు చెల్లించే స్తోమత తమ తల్లిదండ్రులకు లేదన్నారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని తనకు హాల్ టికెట్ ఇచ్చి పరీక్షలకు హాజరయ్యే విధంగా చేయాలని కోరుతోంది.

అనుమానాస్పద స్థితిలో మహిళా పోలీసు మృతి


రెడ్డిరోజా (ఫైల్)

మదనపల్లె : సచివాలయ మహిళా పోలీసు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని రామారావుకాలనీ స్టోర్‌వీధికి చెందిన అరుణమ్మ, రెడ్డెప్పల కుమార్తె రెడ్డిరోజా(35)ను, పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డు విద్యోదయా కాలనీకి చెందిన లక్ష్మీరవికుమార్‌తో 16 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. రెడ్డిరోజా కలికిరి మండలం పారపట్ల సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తుండగా, కలికిరి పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో లక్ష్మీరవికుమార్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. దంపతులు ఇద్దరూ కలికిరిలో నివాసం ఉంటున్నారు. శనివారం రెడ్డిరోజా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఇంటికి వచ్చిన అనంతరం మదనపల్లెలో బంధువుల ఇంటిలో జరుగుతున్న శుభకార్యానికి హాజరైంది. సాయంత్రం భర్తతో కలిసి రామారావుకాలనీలోని పుట్టింటికి వెళ్లింది. అక్కడే ఇద్దరూ ఒకే గదిలో ఉండగా, భర్త టీ కోసం బయటకు వచ్చి పదినిమిషాల అనంతరం గదిలోకి వెళ్లాడు. అప్పటికే రెడ్డిరోజా చీరచున్నీతో గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతుండగా కిందకు దించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అక్కడి నుంచి హుటాహుటిన రెడ్డిరోజాను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీ గదికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ రమణ ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను అడిగి వివరాలు సేకరించారు. అయితే, గత 15 సంవత్సరాలుగా తమకు పిల్లలు లేకపోవడం, అనేక ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో తన భార్య రెడ్డిరోజా తీవ్ర మనస్తాపానికి గురైందన్నారు. పలుమార్లు ఈ విషయమై తనవద్ద బాధపడేదని, శనివారం శుభకార్యంలో మరోసారి రెడ్డిరోజా మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని భర్త లక్ష్మీరవికుమార్ చెప్పారు. కాగా, రెడ్డిరోజా తల్లిదండ్రులు అరుణమ్మ, రెడ్డెప్పలు బంధువులతో కలిసి ఆస్పత్రికి చేరుకుని తమ బిడ్డ మృతికి అల్లుడు లక్ష్మీరవికుమార్ కారణమని ఆరోపిస్తూ గొడవకు దిగారు. గదిలో ఉన్న 10 నిమిషాల్లోనే తమ కుమార్తె ఎలా ఉరివేసుకుంటుందని వాదనకు దిగారు. ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీస్ సిబ్బంది వారికి సర్దిచెప్పి, స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు. దీంతో అక్కడి నుంచి వెళ్లి వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కల్తీ మద్యం ముఠా అరెస్టు


అరెస్టయిన నిందితులు, సామగ్రి

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రైల్వేకోడూరు, తిరుపతి తదితర ప్రాంతాలలో కల్తీ మద్యం విక్రయిస్తూ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆ ధ్వర్యంలో శనివారం తొలుత అనంతరాజుపేటలో దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్టు చేశారు. రెండు వాహనాలు, 509 బాటిళ్ల కల్తీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించగా అసలు గుట్టు రట్టయింది. వారిచ్చిన సమాచారం మేరకు తిరుపతి, కోడూరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 1641 మద్యం బాటిళ్లు, ఒక కారు, 7000 ఖాళీ సీసాలు, మూతలు, స్టిక్కర్లు, ప్రింటరు, లాప్‌టాప్, మిషనరీ, 8051 లీటర్ల స్పిరిట్ స్వాధీనం చేసుకుని మరో ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి కేంద్రంగా ఈ ముఠా కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉందన్నారు. అరెస్టయిన వారిలో కోడూరుకు చెందిన అయ్యప్ప, ఓబులవారిపల్లికి చెందిన నారాయణరాజు, శివశంకర్, నరసింహ, తిరుపతికి చెందిన బాబు, చికెన్ శ్రీను, మహేశ్వర్, శివశంకర్ ఉన్నారన్నారు. అలాగే వీరికి స్పిరిట్, ఫ్లేవర్లు, బాటిళ్లు, స్టిక్కర్లు సరఫరా చేసిన నిందితులు హైదరాబాద్‌కు చెందిన చరణ్‌జ్యోత్‌సింగ్, అక్షయ్‌లను అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ దాడిలో సీఐలు ఎల్లయ్య, తులసీ, నీలకంఠారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద సృష్టి అంటే ఏమిటి బాబూ?


విజయ భాస్కర్

రాయచోటి టౌన్ : సంపద సృష్టి అంటే ఏమిటి బాబూ.? విద్యుత్ చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం, వైన్ షాపుల టెండర్ల ద్వారా రూ.20 వేల కోట్లు దండుకోవడమా అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ ప్రశ్నించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో మాత్రం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచకుండా రాష్ట్ర మంతటా పెంచడం ఏమిటన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెండచం, జగన్ మోహన్‌రెడ్డి ఇస్తున్న పథకాలన్నింటినీ ఆపేయడం కూడా సంపద సృష్టి అవుతుందా అని నిలదీశారు. సూపర్ సిక్స్ అన్నారు.. గద్దెనెక్కగానే ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. లోకేష్ ఏమో ప్రతి సంవత్సరం జనవరికి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 20 వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు.. కానీ అందుకు భిన్నంగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులనే తొలగించే పనులు మొదలు పెట్టారన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. కానీ టీడీపీ అధికారంలోకి రాగానే ప్రజలపై వివిధ రకాల పన్నులు విధిస్తోందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సుగవాసి శ్యామ్, కొత్తిమీర ప్రసాద్ పాల్గొన్నారు.

చెలరేగిన ఆంధ్రా బ్యాట్స్‌మన్

– రెండో మ్యాచ్‌లో భారీస్కోరు దిశగా ఆంధ్రా జట్టు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో కల్నల్ సీకే నాయుడు అండర్-23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు బ్యాట్స్‌మన్ చెలరేగారు. శనివారం నిర్వహించిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రా జట్లు తలపడగా ఆంధ్రా జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి ఆంధ్రా జట్టు 360 పరుగులు చేసింది. జట్టులోని హేమంత్‌రెడ్డి 136 పరుగులు, వెంకటరాహుల్ 162 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్లు సాహిల్ శర్మ 2, నారాయణ 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

ఆటోను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

– ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

వేంపల్లె : వీరపునాయునిపల్లి మండలం నేలతిమ్మయ్యగారిపల్లె గ్రామ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొంది. ముకుంద ట్రావెల్స్‌కు చెందిన బస్సు హైదరాబాదు నుంచి వేంపల్లెకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె పట్టణ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన కూలీలు ఆటోలో ఎర్రగుంట్లకు వెళుతుండగా నేలతిమ్మయ్యగారిపల్లె గ్రామ సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి వస్తున్న ముకుంద ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు, శ్రీనివాసులు, అంజనమ్మ, లక్ష్మయ్య, వీరయ్య, రమణమ్మ, చిన్న రాయుడులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వీరయ్య (57)మృతి చెందాడు. ఆంజనేయులు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని వీరపునాయునిపల్లె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

బాలల కోసం బంగారు లోకం

- వేలాదిమందితో బాలోత్సవం
- 20కి పైగా పలు రకాల పోటీలు
- ప్రాంగణమంతా బాలల సందడే సందడి


ప్రదర్శన కోసం తీసుకున్న వస్తున్న ఎగ్జిబిట్లు

కడప కల్చరల్ : ఆ ప్రాంగణమంతా ఉదయం నుంచి సా యంత్రం వరకు బాలల కోసం ఏర్పడిన బంగారు లోకాన్ని తలపించింది. బడి అన్న బిడియం, పాఠాలన్న భయం, అయ్యవార్లు దండిస్తారేమోనన్న అనుమానాలు లేనే లేవు. రెక్కలు వచ్చిన కొత్త పక్షుల్లా సాయంత్రం వరకు ఆడిపాడి ఆనందించారు. కడప బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో రెండవ ఉత్సవం తొలిరోజు కార్యక్రమాన్ని శనివారం స్థానిక సెయింట్ జోసెఫ్ హైస్కూలులో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ జాతీయ పతాకావిష్కరణ చేసి కార్యక్రమాన్ని, కమిటీ బాధ్యులు రాజా వెంగళరెడ్డి ఇతర కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఒక ఉత్సవంలో ఇంతమంది విద్యార్థులు పాల్గొనడం ఇదే మొదటిసారన్నారు. ఇది తమతోపాటు నిర్వాహకులకు ఎంతో సంతోషాన్ని, ఉత్సాహ ప్రోత్సాహాలను కలిగిస్తోందన్నారు. ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. మానసిక వికాసం, శాస్త్రీయ దృక్పథం పెరిగేందుకు, మానవత్వాన్ని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. నిర్వాహకులను అభినందించారు. మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి, బాలోత్సవం గౌరవ సలహాదారులు వీర సుదర్శన్ రెడ్డి, గౌరవాధ్యక్షులు నాగముని రెడ్డి, అధ్యక్షులు గుర్రాల గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ మృత్యుంజయరావు , డాక్టర్ ఓబుల్ రెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఉషా తులసి, సుందరయ్య, డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి, రఘునాథరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు ఆశ్చర్యకరం

కార్యక్రమాలకు జిల్లా నలుమూలల నుంచి తమదైన శైలిలో బుర్రలకు పదునుపెట్టి పెద్దలు ఆశ్చర్యపోయేలా వస్తువులను తయారు చేసుకుని వచ్చారు. తొలిరోజు 12 అంశాలలో సీనియర్లు, జూనియర్, సబ్ జూనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహించారు. జానపద, శాస్త్రీయ నృత్యాలు, దేశభక్తి గీతాల ఆలాపన, రెయిమ్స్, విచిత్ర వేషధారణ తదిత ర అంశాలలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రాంగణంలో మొత్తం నాలుగు విభాగాలుగా వేదికలను ఏర్పాటు చేశారు. ప్రతి విభాగానికి సరిపడ నిర్వాహకులు, కో ఆర్డినేటర్లు, న్యాయ నిర్ణేతలు తదితరులు కార్యక్రమాన్ని సజావుగా నడిపించేందుకు తమవంతు సహకారం అందజేశారు.

ఆకర్షణీయం

ఈ ఉత్సవంలో ప్రధానంగా మట్టితో బొమ్మలు చేసే నైపుణ్యం అందరినీ ఆకట్టుకుంది. దినపత్రిక పఠనం, కథలు చెప్పడం, బెస్ట్ ఫ్రం వేస్ట్, కార్టూన్లు, మెమొరీ టెస్టు తదితర అంశాలను పెద్దలను సైతం ఆశ్చర్యపరిచాయి. నృత్య వేదికపై చిన్నారులు చేసిన శివతాండవం, పుష్ప-2 జాతర సందర్భులను ఉర్రూతలూగించాయి.